

# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ఏప్రిల్ 27–28, 'కళాభారతి', కరీంనగర్**

**ప్రారంభకులు: ప్రొఫెసర్ రణధీర్‌సింగ్, ఢిల్లీవిశ్వవిద్యాలయం**

ప్రజలారా!

నాలుగు దశాబ్దాల స్వాతంత్ర్యం తరువాత భారత ప్రజాస్వామ్యం ఇవ్వాళ తీవ్రమయిన సంక్షోభంలో ఉంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఒక శతాబ్దంపైగా పోరాటంచేసి ప్రజలు సాధించుకున్న ప్రజాస్వామ్య రాజకీయవ్యవస్థనూ, పరిపాలనా సరళినీ పాలకులు మన కళ్లముందే ధ్వంసం చేస్తున్నారు. శతాబ్దాలుగా ఈ దేశంలో జరిగిన సామాజిక ఉద్యమాల నుండీ, పోరాటాల నుండీ పుట్టిన ప్రజాస్వామిక విలువలనూ, సమసమాజ ఆకాంక్షలనూ స్వప్రయోజన శక్తులు నాశనం చేస్తున్నాయి. ఈ పోరాటాలనుండీ, ఉద్యమాలనుండీ పుట్టిన విలువలనూ ఆకాంక్షలనూ అనేక పరిమితులతోనూ మినహాయింపులతోనూ తనలో ఇముడ్చుకున్న భారత రాజ్యాంగంలోని ప్రజోపయోగమయిన అంశాలకు వ్యవస్థలో ఆదరణ లేకుండ పోయింది. ఈ అంశాలు ఒకరు ఇచ్చినవి కావు, తాము సాధించుకున్నవని గుర్తించి వాటి పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమించవలసిన అవసరం ఏర్పడింది.

దేశంలో సామాజిక ఆర్థిక సంక్షోభం పెరిగే కొద్దీ అణచివేత పెరుగుతుంది, బలహీనులపైన బలవంతుల హింసాకాండ పెరుగుతుంది, ప్రజాస్వామిక విలువల విధ్వంసం పెరుగుతుంది. పాలకులు ధరలను అదుపు చేయలేకుండవున్నారు. ఉద్యోగాలు కల్పించలేకుండ వున్నారు. భూమిలేని పేదలకు భూములు ఇవ్వలేకుండ ఉన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు గానీ అవసరమయినంత నీటివసతిగానీ కరెంటు సరఫరాగానీ సమకూర్చలేకుండ వున్నారు. తరతరాలుగా మన సమాజంలో రెండవ తరగతి పౌరులుగా చూడబడుతున్న దళితులకూ స్త్రీలకూ ఇతరులతో సమానప్రతిపత్తినీ సమాన గౌరవాన్నీ సమాన అవకాశాలనూ కల్పించలేకుండ వున్నారు. ఏ భాష మాట్లాడేవారయినా ఏ దేవుణ్ని ఆరాధించేవారయినా సమాజంలో రాజకీయాలలో సమాన ప్రాధాన్యతకూ సమాన గౌరవానికీ అర్హులేననే హక్కు కల్పించలేకుండ వున్నారు.

అయితే ప్రజలివ్వాళ ప్రభుత్వం వీటిని కల్పిస్తుందని కాచుకుని కూర్చోవడానికి సిద్ధంగా లేరు. ఎవరో ఇస్తారని ఆశపడడంతో సంతృప్తి చెందడంలేదు. 'నేను ఎవ్వరికంటే తక్కువకాదు' అని ప్రతివ్యక్తి ఇవ్వాళ అనుకుంటున్నారు. 'మేము ఎవ్వరికంటే తక్కువకాదు' అని ప్రతీవర్గమూ అనుకుంటూవుంది. ఈ చైతన్యం అనేక పోరాటాల రూపంలో ఉద్యమాల రూపంలో తిరుగుబాట్ల రూపంలో వ్యక్తమవుతూవుంది. ఈతిరుగుబాట్లు సంఘటితంగానూ అసంఘటితంగానూ జరుగుతున్నాయి. సంఘటితంగా జరిగిన చోట రకరకాల రాజకీయ సిద్ధాంతాలను ఆశ్రయిస్తున్నాయి. రకరకాల ఆందోళనా పద్ధతులను అవలంబిస్తున్నాయి. అన్ని రాజకీయాలూ అన్ని ఆందోళనా పద్ధతులూ అందరికీ నచ్చకపోవచ్చును. అవి అమానుష రూపం తీసుకుంటే ప్రజలలో వ్యతిరేకత రావడమూ సహజమే. అయితే వీటి వెనకున్న సమస్యలను గానీ పోరాటచైతన్యాన్నిగానీ కాదనడం అసాధ్యం.

ఆందోళనలూ పోరాటాలూ ముందుకొచ్చినప్పుడు వాటి వెనకవున్న సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యత. ఆ బాధ్యత లేదనుకుంటే భారత రాజ్యాంగంలోని నాలుగవ అధ్యాయానికి అర్థం లేదు. పరిష్కరించడం సాధ్యం కాకపోతే, తన వైఫల్యం నుండి పుట్టిన ఉద్యమాలను రాజకీయ ఉద్యమాలుగా గుర్తించి వాటి స్వేచ్ఛనూ మనుగడనూ గౌరవించడం ప్రభుత్వం బాధ్యత. ఉద్యమకారులు నేరాలకు పాల్పడితే తప్పక కేసుపెట్టవలసిందే, నేరాలను నిరోధించవలసిందే. అయితే ఉద్యమాన్నే ఒక నేరంగా భావించడానికి వీలులేదు. ఉద్యమాన్నే ఒక శాంతి భద్రతల సమస్యగా భావించడానికి వీలులేదు.

మనదేశంలో జరుగుతున్నది అదే. ప్రజలలో చైతన్యం పెరిగేకొద్దీ ప్రభుత్వమూ పెత్తందారీశక్తులూ అణచివేతను పెంచుతున్నాయి. ఏ అన్యాయాన్నయితే ప్రశ్నిస్తున్నారో ఆ అన్యాయాన్ని తొలగించే బదులు ప్రశ్నించేవాళ్లనే తొలగించివేయాలని చూస్తున్నారు. భూమిలేని రైతుకూలీల చైతన్యం పెరిగేకొద్దీ భూమి పంపిణీ కాదు పెరుగుతున్నది; ఎన్‌కౌంటర్లు, టాడాకేసులు, చిత్రహింసలు పెరుగుతున్నాయి. స్త్రీలలో చైతన్యం పెరిగేకొద్దీ వాళ్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కాదు పెరుగుతున్నది; కుటుంబంలో స్త్రీల మీద అణచివేత పెరుగుతోంది. వరకట్నం చావులు పెరుగుతున్నాయి. దళితులలో ఆత్మగౌరవం, సమానత్వ ఆకాంక్ష పెరిగేకొద్దీ సమానత్వం కాదు పెరుగుతున్నది; కారంచేడులూ తిమ్మసముద్రాలూ మరింత విరివిగా జరుగుతున్నాయి. రిజర్వేషన్‌వ్యతిరేక ఆందోళనలు బలం పుంజుకుంటున్నాయి. తెలిసో తెలియకో నేరాలలో ఇరుక్కునే సామాన్య ప్రజలలో కూడ తమ హక్కులను గురించి చైతన్యం పెరిగే కొద్దీ పోలీసు యంత్రాంగం సత్ప్రవర్తన పెరగడం లేదు, లాకప్పు మరణాలు పెరుగుతున్నాయి. తమకు ఇతరులతో సమానమైన ప్రతిపత్తి లభించడంలేదని వివిధ జాతుల ప్రజలు భావించడం పెరిగేకొద్దీ సమానత్వం పెరగడంలేదు, సరిహద్దు రాష్ట్రాలలో సైన్యం మోహరింపు పెరుగుతూవుంది. ఆ సైన్యానికి ఇచ్చే విశేష అధికారాలు పెరుగుతున్నాయి.

ఈ అణచివేతకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఇవ్వాళ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తూవుంది. 'ఎన్‌కౌంటర్ల వల్ల సామాజిక ఆర్థిక సమస్యలు పరిష్కారం కావనీ, లాకప్పు మరణాల వల్ల నేరాలు అరికట్టబడవనీ, విచ్చలవిడి కాల్పుల వల్ల అలజడులు, అల్లర్లు ఆగవనీ ప్రభుత్వాన్నీ పోలీసు యంత్రాంగాన్నీ హెచ్చరిస్తున్నాము. ఈ రకమయిన అణచివేతను బహిర్గతం చేయడంకోసం కోర్టులలో కేసులు వేసాము, న్యాయవిచారణలలో పాల్గొన్నాము, సభలద్వారా ప్రచురణలద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసాము. స్త్రీలలోను దళితులలోనూ ఇవ్వాళ బలంగా ముందుకొస్తున్న సమానత్వ ఆకాంక్షకు అండగా నిలబడ్డాము. వరకట్నం హత్యల పట్ల కోర్టులూ పోలీసు యంత్రాంగమూ ప్రదర్శిస్తూవున్న నిర్లక్ష్యవైఖరిని ఎండగడుతూ ప్రచురణలు చేపట్టాము. దళితుల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాము. రిజర్వేషన్లకు అనుకూలంగా విస్తృతంగా ప్రచారం చేసాము. దళితులపైన స్త్రీలపైన జరిగే హింసాకాండ మీద కేసులు నమోదు చేసి విచారణ సక్రమంగా నిర్వర్తించాలని పోలీసు యంత్రాంగం మీద ఒత్తిడి పెట్టాము. వాతావరణ కాలుష్యాన్ని గురించి, చిత్తూరుజిల్లాలో అడవి ఏనుగుల సమస్య గురించీ, మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల్లో పులుల సమస్య గురించీ ఆందోళన చేపట్టాము, కోర్టులలో కేసులు వేసాము. ఇవి సహజసిద్ధంగా వచ్చిన సమస్యలు కావనీ ప్రభుత్వ పారిశ్రామిక, అటవీ విధానాలలోని ప్రజావ్యతిరేక స్వభావంవల్ల వచ్చిన సమస్యలనీ మా అభిప్రాయం. అన్నిటినీ మించి, నక్సలైట్ ఉద్యమాన్ని అణచడం అనే పేరుమీద అమలయిన పోలీసు హింసాకాండను - చిత్రహింసలను, గృహవిధ్వంసనాన్నీ, తప్పుడు కేసులను, ఆస్తుల ధ్వంసాన్నీ - రాష్ట్ర వ్యాపితంగా వ్యతిరేకిస్తూ ప్రచారం చేపట్టాము. పదవులకోసం అధికారం కోసం రిగ్గింగ్‌కు, ఎన్నికలప్పుడు బాంబుదాడులకు పాల్పడే రాజకీయ నాయకులను, అధికారం కోసం మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పార్టీలనూ, ముఠాలనూ వ్యతిరేకిస్తూ ప్రచారం చేపట్టాం. లౌకికవాదం అనే మౌలికమయిన ప్రజాస్వామిక విలువకు గొడ్డలిపెట్టయిన రామజన్మభూమి ఆందోళనకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాము.

ఇన్ని రంగాలలో కృషిచేస్తున్న పౌరహక్కుల సంఘమంటే పెత్తందార్లకూ ప్రభుత్వానికి పోలీసు యంత్రాంగానికి కంటగింపు కావటంలో ఆశ్చర్యం లేదు. మామీద భౌతికదాడులకు పాల్పడ్డారు. అరెస్టు చేసారు, నాసాటాడాల క్రింద నిర్బంధించారు. తప్పుడు కేసులు బనాయించారు, కిడ్నాప్ చేశారు. మాసభలను సమావేశాలనూ నిషేధించారు. వాటికి హాజరు కావద్దని జనాన్ని బెదిరించారు. పౌరహక్కుల సంఘంలో పనిచేయవద్దని కార్యకర్తలను బెదిరించారు. ఈ అణచివేతలో గోపిరాజన్ననూ, డా॥ రామనాథంగారినీ, జాపాలక్ష్మారెడ్డిగారినీ పోగొట్టుకున్నాము. అయినప్పటికీ ఈ దాడులకూ బెదిరింపులకూ లొంగకుండ ప్రజల సహాయసహకారాలతో పనిచేస్తూనే వున్నాం.

ఈ క్రమంలో మా 7వ రాష్ట్ర మహాసభలను ఏప్రిల్ 27-28 తేదీలలో కరీంనగర్ పట్టణంలో జరుపుకుంటున్నాం. లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ నివాసి అయిన శ్రీ.డి. ఆంజనేయులుగారి అధ్యక్షతన ఆహ్వాన సంఘం ఏర్పాటయింది. సభలకు రాష్ట్రంలో ప్రజలూ ప్రజాస్వామికవాదులూ మద్దతు తెలపాలనీ, ప్రజలహక్కుల పరిరక్షణలో మాకు అండగా నిలవాలనీ కోరుకుంటున్నాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
( APCLC)